## క్లుప్తంగా

### నేటి నుంచి ఉచిత కుట్టు శిక్షణ

ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని కమల ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ట్రెనింగ్ సెంటర్ ఆధ్వర్యాన మెస్సియ ఫెలోషిప్ చర్చి ఆవరణలో మంగళవారం నుంచి పేద మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ తరగతులను ప్రారంభించనున్నట్లు ఆ ట్రెనింగ్ సెంటర్ వ్యవస్థాపకులు సజ్జా జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 11 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తయ్యాయని.. మంగళవారం 12వ బ్యాచ్‌కి శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

### 26న సామూహిక అక్షరాభ్యాసాలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఈ నెల 26 తేదీ గురువారం ఉదయం 11 గంటలకు వసంత పంచమి సందర్భంగా తమ స్కూల్ ఆవరణలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సిద్ధార్థనగర్‌లోని లిటిల్ బ్రెయిన్స్ స్కూల్ డైరెక్టర్ ముక్తేవి ఫణి ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు స్కూల్ ఆవరణలో నేరుగాకానీ, 95151 11525, 70754 95975 నెంబర్లల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

### ఫిబ్రవరి 8, 9 తేదీల్లో తరుణీ తరంగాల మహిళా ఫెస్ట్

కృష్ణలంక(విజయవాడతూర్పు): తరుణీ తరంగాల 5వ మహిళా ఫెస్ట్‌ను ఫిబ్రవరి 8, 9 తేదీల్లో సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని ఆ సంస్థ అధ్యక్షురాలు రావి శారద అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్త్రీలలో సృజన వెలికితీయడానికి మహిళా ఫెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు 19, మహిళలకు 12 రకాల పోటీలు జరుగుతాయన్నారు. తరుణీ తరంగాల కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ నగరంలో ఏటా అన్ని మహిళా సంఘాలను కలుపుకుని ఫెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో ప్రత్యేకంగా టీనేజీ అమ్మాయిల కోసం మనసులో మాట కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆసక్తిఉన్నవారు ఎంట్రీ ఫారమ్‌లను పూర్తి చేసి తమ కార్యాలయానికి పంపాలని కోరారు. మిడ్‌టౌన్ ఇన్నర్ వీల్ ప్రెసిడెంట్ కరంకౌర్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీదేవి, సరోజ, రాజేశ్వరి, ఝాన్సి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

### బాల్య వివాహాలను అరికట్టాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బాల్య వివాహాలను అరికట్టాలని 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం వేడుకలు న్యూరాజరాజేశ్వరీపేటలో సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలంటే సమాజంలో వివక్ష చూపడం అలవాటుగా మారిందని, తల్లి గర్భంలో ఉన్నది మొదలుకొని బాలికలపై దాడులు చోటుచేసుకోవడం అత్యంత బాధాకరమన్నారు. అనంతరం పలువురు పెద్దలలు బాలికల దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాగేశ్వరరావు, షేక్ బాజీ, పాస్టర్ శ్యామ్‌సుందర్, చైల్డ్‌లైన్ సూర్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

### మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

పాయకాపురం(విజయవాడరూరల్): డివిజన్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి అన్నారు. డివిజన్‌లోని పటేల్ నగర్లో సోమవారం కల్వర్టు నిర్మాణ పనులకు కార్పొరేటర్ విజయలక్ష్మి భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ పటేల్ నగర్, ఎల్‌బీఎస్‌నగర్‌లో ఒక్కోటి, ప్రకాష్‌నగర్లో రెండు చొప్పున కల్వర్టుల నిర్మాణాలకు వీఎంసీ రూ. 10 లక్షలు మంజూరు చేసిందన్నారు. వర్షాలు పడితే వాన నీరు ఇళ్లలోకి ప్రవేశిస్తుండటంతో కల్వర్టులు ఏర్పాటుచేయాలని స్థానికుల విజ్ఞప్తిపై వీటిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నేతలు అలంపూరు విజయకుమార్, రామిరెడ్డి, బుజ్జి, శ్రీను, వెంకట్, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

### మత్తు పదార్థాలతో జీవితం అంధకారం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం అంధకారమవుతుందని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలోని కేర్ అండ్ షేర్ మున్సిపల్ హైస్కూల్‌లోని విద్యార్థులకు 'మత్తు పదార్థాల'పై సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలతో ఎదురయ్యే అనారోగ్య సమస్యలను స్క్రీన్‌సాయంతో విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, నవజీవన్ బాలభవన్ కోఆర్డినేటర్స్ ఎఫ్.మమత, ఎండీ వసంతకుమారి, పాఠశాల ఉపాధ్యాయులు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### వారాహిమాతకు పంచామృతాభిషేకం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీలలితాంబికా పీఠంలో నిర్వహిస్తున్న శ్యామలాదేవి నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజు సోమవారం అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని శ్యామలాదేవి విగ్రహానికి పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

# అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

పటమట(విజయవాడతూర్పు): ప్రజా సమస్యలపై వచ్చే అర్జీలు సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వీఎంసీ విభాగ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం జరిగిన స్పందనలో ఆయన నగరవాసుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత వాటి పరిష్కారానికి వ్యూహాలను మార్చుకోవాలన్నారు. స్పందనలో మొత్తం 18 అర్జీలు రాగా అందులో పట్టణ ప్రణాళిక – 8, ఇంజినీరింగ్ – 2, పబ్లిక్ హెల్త్ విభాగం – 2, యు.సి.డి – 2, రెవెన్యూ– 4 వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (జనరల్) ఎం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, పట్టణ సామాజికాభివృద్ధి విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి) శకుంతల, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ కె.బి.ఎస్.ఎస్ లత, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, తె.డి. హెచ్ శ్రీనివాసు, మేనేజర్ బి.శ్రీనివాస్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): మహిళలు ఒక్కరంగానికే పరిమితం కాకుండా, టెక్నికల్, కన్‌స్ట్రక్షన్ వంటి ఎన్నో క్లిష్టమైన రంగాల్లో రాణించాలని చేగువేరా కుమార్తె అలైదా గువేరా అన్నారు. మహాత్మాగాంధీ రోడ్డులోని శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో సోమవారం జెండర్ ఈక్వాలిటీ అనే అంశంపై సదస్సు జరిగింది. ఆమె మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి ప్రతి ఒక్కరూ తమ తమ హక్కుల కోసం ఎలా పోరాడాలో నేర్చుకోవాలని, మనం లైఫ్‌లో ఏమి ఇస్తామో అదే తిరిగి వస్తుందన్నారు. తర్వాత తరాన్ని హెల్దీగా నిర్మాణం చేయాలంటే ఇప్పటి నుంచే సమానత్వం కావాలని సూచించారు. మరో అతిథి ఎస్టీఫేనియా గువేరా మాట్లాడుతూ జీవితంలో మహిళల ప్రాధాన్యం ఎంతో ఉంటుందన్నారు. మహిళలు, పురుషులు సామూహికంగా పని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ టి. విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలైదా గువేరా, ఎస్టిఫేనియా గువేరాలను ఘనంగా సత్కరించారు.



అలైదా గువేరా, ఎస్టిఫేనియా గువేరాలను సత్కరిస్తున్న దృశ్యం

## పొదుపు చేయడం అలవర్చుకోవాలి



ఉప్పలపాటి రామచంద్రరాజు హైస్కూల్‌లో ఉత్తమ విద్యార్థులతో ఎల్ఐసీ మేనేజర్ జగదీష్

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిన్ననాటి నుంచి పొదుపు చేయడం అలవర్చుకుంటే భవిష్యత్ జీవితానికి ఎంతో ఉపయోగపడుతుందని ఎల్ఐసీ భవానీపురం సిటీ బ్రాంచ్ మేనేజర్ ఎస్.జగదీష్ అన్నారు. భారతీయ జీవిత బీమా సంస్థ ఏటా ప్రభుత్వం పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఆ అకడమిక్ ఇయర్‌లో ఉత్తమ విద్యార్థికి బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాన్ని అందచేయటం ఆనవాయితీగా వస్తోందని ఆయన వివరించారు. అందులో భాగంగా సోమవారం విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్, మైలపల్లి పోలీస్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్, లేబర్ కాలనీలోని ఉప్పలపాటి రామచంద్రరాజు మున్సిపల్ హైస్కూల్, జోజినగర్‌లోని ఎస్‌డీఎం వైఆర్‌ఆర్ ఎయిడెడ్ హైస్కూల్ విద్యార్థులలో 30 మందికి ఉత్తమ విద్యార్థుల పురస్కారాన్ని అందజేశారు. డీఎస్‌ఎమ్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మాతంగి కోటయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్ననాటి నుంచే పొదుపు చేయడం నేర్పాలని కోరారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజంట్ పులిపాటి కనకదుర్గ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాగవంశం కార్పొరేషన్ చైర్‌పర్సన్‌కు సత్కారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): నాగవంశం కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా రెండోసారి ఎన్నికైన సందర్భంగా బొడ్డు అప్పలకొండమ్మను సోమవారం నాగవంశం సంక్షేమ సంఘం నేతలు ఘనంగా సత్కరించారు. నగరంలోని ఆమె నివాసంలో పలువురు నేతలు కలిసి అప్పల కొండమ్మను శాలువాతో సత్కరించారు. నాగవంశం కులస్తుల అభివృద్ధికి కృషి చేసేలా మళ్లీ అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమంలో నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ ఎర్నింటి సుజాత, సంక్షేమ సంఘం నగర అధ్యక్షులు తాలడ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షులు మద్దిల శ్రీను, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు డొంక రాజు, తాలాడ సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.



బొడ్డు అప్పలకొండమ్మను సత్కరిస్తున్న నాగవంశం సంక్షేమసంగం నాయకులు

## • దుమ్ము దుమారం





విజయవాడ భవానీపురంలో భవానీఘాట్ వద్ద సోమవారం సాయంత్రం ఒక్కసారిగా పెద్ద గాలి, దుమ్ముతో దుమారం వచ్చింది. ఇసుక తుపానులా కనిపించిన దృశ్యాన్ని స్థానికులు తిలకించారు.

-కిషోర్, సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

### అలరించిన జానపద గీతాలు

విజయవాడ కల్చరల్: పరసా పరిమళ ఫౌండేషన్ ఆధ్వర్యాన తుమ్మపల్లి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన సినీ, జానపద గీతాలాపన ఆకట్టుకుంది. ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం, చిత్ర, భానుమతి, జేసుదాసు పాడిన గీతాలను మల్లీశ్వరి, శ్రీనివాస్, లక్ష్మి, రాజేశ్వరి ఊర్వశి, శిరీష, పలువురు గాయనీ గాయకులను ఆలపించారు. కార్యక్రమాన్ని పరసా వరప్రసాద్, పరిమళ నిర్వహించారు. చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు, బండారు నరసింహారావు పాల్గొన్నారు. గాయకులకు ప్రశంసాపత్రాలను అందించారు.

### పైపులైను పనుల పరిశీలన

నున్న(విజయవాడరూరల్): నున్న జగనన్న కాలనీలో జలజీవన్ మిషన్ నిధులు రూ.17 లక్షలతో నిర్మించిన పైపులైను నిర్మాణం పనులను క్వాలిటీ కంట్రోల్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిమోహన్ సోమవారం పరిశీలించారు. జగనన్న కాలనీలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాల కోసం రెండు బోరులు నుంచి 35 తాత్కాలికంగా ట్యాప్ కనెక్షన్లు ఇచ్చారు. ఈ పరిశీలనలో ఏఈ శ్వేత, ఇంజినీరింగ్ అసిస్టెంటు రాజు పాల్గొన్నారు.

### వాహన చోదకులూ అప్రమత్తం

విజయవాడ స్పోర్ట్స్: డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగానే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ డీసీపీ కె.శ్రీనివాసరావు అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని విజయవాడలోని ఆటోడ్రైవర్లకు బెంజిసర్కిల్ వద్ద జ్యోతి కన్వెన్షన్ హాలులో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

డ్రైవింగ్‌పై సరైన అవగాహన లేకపోవడం, అతి వేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించి వాహనం నడపటం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహన నడపటం, ఓవర్ టేకింగ్, ట్రిపుల్ రైడింగ్ తదితర కారణాలతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఈ సందర్భంగా డీసీపీ తెలిపారు. అనంతరం రోడ్డు భద్రత వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ట్రాఫిక్ ఏడీసీపీ టి.సర్కార్, ఏసీపీలు జె.వెంకటనారాయణ, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గంలో సోమవారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకృష్ణ ప్రార్థనా మందిరంలో సుహాసినీలు గోక్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. అనంతరం శాంతిహోమాలను నిర్వహించారు. అమ్మవారికి స్వర్ణకిరీట ధారణ చేశారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ, గుడిపాటి పాపారావు పర్యవేక్షించగా, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

**కన్యకా పరమేశ్వరి సన్నిధిలో..**

శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో (కొత్తగుళ్ళు) అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విశేష కార్యక్రమాలను నిర్వహించారు. విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం, యువజన, మహిళ, సేవాదళ్ సంఘాల ఆధ్వర్యంలో శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి (ఆత్మార్పణ) విశ్వరూప సందర్శన మహోత్సవం సందర్భంగా పుష్పయాగసహిత కుంకుమార్చన జరిగింది. అనంతరం కల్యాణ వేదికపై అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రతిష్ఠింపజేసి వందలాది మంది మహిళలతో కుంకుమార్చనలు చేశారు. .

**ప్రత్యేక పూజలు చేసిన వెలంపల్లి**

అమ్మవారి విశేష కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి దీవెనలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై పుష్కలంగా ఉండాలని కోరుకున్నానని చెప్పారు. సాయంత్రం బ్రాహ్మణవీధిలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పల్లపోతు మురళీకృష్ణ, చాంబర్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, నాయకులు శేగు వెంకటేశ్వరరావు, మిత్తింటి శారద, ఇందిరా దేవస్థానం అధ్యక్షులు నందిపాటి శంకరావు తదితరులు పాల్గొన్నారు.

**వాసవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో**

పూజారి వారి వీధిలోని లక్ష్మీనారాయణ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవి ఫౌండేషన్ ఆవరణలో వాసవీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఫౌండేషన్ అధ్యక్షులు వీవీకే నరసింహారావు ఆధ్వర్యంలో ఉదయం కృష్ణానది నుంచి మహిళలు పవిత్ర జలాలను తీసుకొని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు కొనిజేటి రమేష్, తుమ్మలపెంట శ్రీనివాసు, కేవీఎల్ గణేష్, అరవేటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న వెలంపల్లి



వాసవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుంకుమార్చనలు

## వార్షిక బ్రహ్మోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): తుళ్లూరు మండలం వెంకటపాలెంలోని శ్రీ రాజరాజేశ్వరీ దేవీ సమేత శ్రీ కోటి లింగేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామి తెలిపారు. నగరంలోని వేముల హజరతయ్య గుప్తా కార్యాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను శివస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివస్వామి మాట్లాడుతూ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వచ్చే నెల 15 నుంచి 19 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. 16న నరసింహ కల్యాణం, 17న వేంకటేశ్వర స్వామి కల్యాణం, 18న శనివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీకోటిలింగేశ్వర స్వామికి మహా రుద్రాభిషేకం, శ్రీ లక్ష్మీ నారాయణ కల్యాణ మహోత్సవం, అనంతరం శివపార్వతులకు నంది వాహన సేవలు జరుగుతాయని తెలిపారు. 19న దివ్య రథోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వేముల చారిటీస్ అధినేత డాక్టర్ హజరత్తయ్య గుప్తా, లక్ష్మీ సరోజ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శివస్వామి

## • ఆత్మీయ సమావేశం



వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ నాయకులు, కార్పొరేటర్‌లతో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ తదితరులు పాల్గొన్నారు.

-లబ్బీపేట(విజయవాడతూర్పు)

## రక్తదాతలే ప్రాణదాతలు

**కలెక్టర్ ఢిల్లీరావు**

లబ్బీపేట(విజయవాడతూర్పు): రక్తదాతలే ప్రాణదాతలని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. నలంద డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో కలిసి ఏర్పాటు చేసిన శిబిరాన్ని కలెక్టర్ ఢిల్లీరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి పురస్కరించుకుని యువత రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన కీర్తి కిరీటం, మరణం లేని అమరుడు సుభాష్‌చంద్రబోస్ అని కొనియాడారు. నాకు రక్తాన్ని ఇవ్వండి, నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను అంటూ పోరాటం చేశారన్నారు. రక్తాన్ని దానం మాత్రమే చేయవచ్చని, ఉత్పత్తి చేయలేమన్నారు.18 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సున్నవారు రక్తదానం చేయొచ్చని, ఒక వ్యక్తి దాదాపు 168 సార్లు రక్తం ఇవ్వొచ్చన్నారు. రక్తదానం చేస్తే నీరసిస్తామనేది అపోహ మాత్రమేనన్నారు. కార్యక్రమంలో నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరం, కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వి.వెంకటేశ్వరరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చంద్రగిరి పాల్గొన్నారు.



నలంద డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

## రూ.20 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం

లబ్బీపేట(విజయవాడతూర్పు): స్థానిక 24వ డివిజన్‌లోని కస్తూరిభాయిపేట ఆర్సీఎం చర్చి రోడ్డులో రూ.20 లక్షల వ్యయ అంచనాతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, స్థానిక కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో అభివృద్ధి అటకెక్కి, ప్రగతి పక్కదారి పట్టిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పాలన గాడిన పడిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒక్క 24వ డివిజన్‌లోనే రూ.12 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వంలో సమస్యలు తెలుసుకోవడంతో పాటు, సచివాలయ పరిధిలోని అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గిరిపురంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌కు మరో రెండు నెలల్లో శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈఈ గురునాథం, డివిజన్ అధ్యక్షులు ఓబిరెడ్డి వెంకట్రామిరెడ్డి, నాయకులు కొమ్ము చంటి, కుక్కల రమేష్, మరియరాణి, బొంగరాల భాస్కరరావు పాల్గొన్నారు.



కస్తూరిబాయ్‌పేట ఆర్సీఎం చర్చి రోడ్డులో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

## విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

**వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

పటమట(విజయవాడతూర్పు): నగరంలో మెరుగైన పారిశుధ్య నిర్వహించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వేటు తప్పదని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజారోగ్య విభాగం అధికారులను, సిబ్బందిని హెచ్చరించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం 4వ డివిజన్ గురునానక్ కాలనీ, 6వ డివిజన్ మాచవరం డౌన్, 25వ డివిజన్ దుర్గాపురం సాంబమూర్తి రోడ్డు ప్రాంతాల్లో పారిశుధ్యం, యూజీడీ విధానాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. సాంబమూర్తి రోడ్డులో చెత్తలోడుతో వెళ్తున్న క్లాప్(క్లీన్ ఆంధ్రప్రదేశ్) వాహనాన్ని ఆపి తడి, పొడి చెత్తను వేరుగా సేకరిస్తున్నారో లేదో పరిశీలించారు. నగరంలో క్లాప్ వాహనాలు నెలంతా ఎంత మేరకు చెత్త సేకరణ చేస్తున్నారో పరిశీలించాలన్నారు. డివిజన్లలో ఇంటింటి చెత్త సేకరణ, కాల్వల్లో నీటి పారుదలకు అడ్డుగా ఉన్న చెత్త– వ్యర్థాలను తొలగించి నూరు శాతం డోర్ టు డోర్ బాస్కెట్ కలెక్షన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య శాఖాధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్లాప్ వాహనాన్ని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

## సేవ చేసేవారిని గుర్తుంచుకుంటారు

ఆటోనగర్(విజయవాడతూర్పు): ప్రజలకు సేవ చేసే వారిని గుర్తుంచుకుంటారని జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ శ్రీశాంతి అన్నారు. నగరంలోని ప్రయివేట్ కల్యాణ మండపంలో సోమవారం లయన్స్ క్లబ్‌లో గత 10 నుంచి 35 సంవత్సరాల పాటు సేవలు అందించిన 300 మంది పాస్ట్ ప్రెసిడెంట్‌లను లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యాన శాలువలు కప్పి సత్కరించారు. శ్రీశాంతి మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో లయన్స్ క్లబ్‌లకు సేవలు చేసినందుకు 'సేవకు సత్కారం' పేరుతో సభ్యులను సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కో ఆర్డినేటర్లు కత్తిక శివనాగేశ్వరరావు, వీవీపీఎస్ ఆంజనేయులు, అన్నె శివనాగేశ్వరరావు, అబ్దుల్ కలాం, బేవర నాగేశ్వరరావు, బత్తుల ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లయన్స్‌క్లబ్ సభ్యులను సత్కరిస్తున్న జిల్లా గవర్నర్ శ్రీశాంతి